నమస్తే తెలంగాణ
మెదక్
I | హైదరాబాద్, శనివారం 27 జూలై 2024 | MEDAK

దుబ్బాక సాంఘిక సంక్షేమ బాలుర గురుకులంలో నేలపైనే విద్యార్థుల చదువులు, వసతి

అద్దె భవనం.. అరకొర వసతులు

సిద్దిపేట జిల్లా దుబ్బాకలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల, కళాశాల తరగతి గదిలోనే ఆరబెట్టుకుంటున్న దుస్తులు

దుబ్బాక, జూలై 26: సిద్దిపేట జిల్లా దుబ్బాక పట్టణ శివారులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం సమీపంలో ఓ అద్దె భవనంలో తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల, కళాశాల కొనసాగుతున్నది. గతంలో ఈ పాఠశాల, కళాశాల మిరుదొడ్డిలో ఉండేది. అక్కడ సరైన వసతులు లేక దుబ్బాకకు తరలించారు. ఇందులో ఐదో తరగతి నుంచి ఇంటర్ వరకు ప్రస్తుతం 475 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. నెలకు రూ.2.27 లక్షలు అద్దె చెల్లిస్తున్నప్పటికీ సరైన వసతులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇరుకైన తరగతి గదుల్లోనే విద్యనభ్యసిస్తూ...మరోపక్క బస చేస్తున్నారు. తరగతి గది, వసతి గది ఒక్కటే కావడం సమస్యగా మారింది. కనీసం చదువుకునేందుకు బెంచీలు, డెస్క్‌లు లేక నేలపైనే చదువులు కొనసాగుతున్నాయి. 475 మంది విద్యార్థులకు కేవలం 12 చొప్పున మరుగుదొడ్లు, స్నానపు గదులు మాత్రమే ఉన్నాయి. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మెరుగైన వసతులు కల్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

హాస్టళ్లను ఎత్తివేసే యోచనలో సర్కారు

సిద్దిపేట జిల్లా మద్దూరులోని ఎస్సీ హాస్టల్ భవనం

మద్దూరు(ధూళిమిట్ట), జూలై 26: నిరుపేద విద్యార్థులకు వసతి కల్పించేందుకు ఏర్పాటు చేసిన సాంఘిక సంక్షేమ వసతి గృహాల(హాస్టళ్లు)ను విద్యార్థులు లేరనే సాకుతో ఎత్తివేసే యోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉన్నట్లు సమాచారం. కొన్ని దశాబ్దాల నుంచి సిద్దిపేట జిల్లా మద్దూరు మండల కేంద్రంలో ఎస్సీ, బీసీ హాస్టళ్లు, లద్నూర్‌లో ఎస్సీ హాస్టల్, ధూళిమిట్టలో ఎస్సీ హాస్టల్ ఉండేవి. కాలక్రమంలో విద్యార్థులు లేరని లద్నూర్ ఎస్సీ హాస్టల్, మద్దూరు బీసీ హాస్టల్‌ను మూసివేశారు. అరకొర విద్యార్థులతో నడుస్తున్న మద్దూరు, ధూళిమిట్ట ఎస్సీ హాస్టళ్లు సైతం రెండేండ్లుగా మూతపడ్డాయి. మూతపడిన ఈ రెండు హాస్టళ్లను ప్రభుత్వం ఈ ఏడాది తిరిగి తెరిచింది. అయితే హాస్టళ్లలో చేరేందుకు ఆయా గ్రామాల విద్యార్థులతో పాటు పరిసర గ్రామాల విద్యార్థులు ముందుకు రావడం లేదు. ఒక్కో హాస్టల్‌లో 100 మంది విద్యార్థులను చేర్చుకునేందుకు అవకాశం ఉన్నా ఒక్క విద్యార్థి కూడా హాస్టల్‌లో చేరేందుకు ముందుకు రావడం లేదు. హాస్టల్‌లో విద్యార్థులను చేర్చుకునేందుకు అధికారులు కూడా అంతంత మాత్రంగానే ప్రచారం నిర్వహించి చేతులు దులుపుకున్నారు. దీంతో ఈ రెండు హాస్టళ్లను సైతం మూసివేసేందుకు ప్రభుత్వం యోచిస్తున్నది. దీనికితోడు ఇటీవల చేపట్టిన బదిలీల్లో రెండు హాస్టళ్లకు వార్డెన్లు కూడా రావడానికి ఆసక్తి కనబర్చడం లేదు. ప్రస్తుతం ఈ రెండు హాస్టళ్లలో వార్డెన్ పోస్టులు ఖాళీ ఉన్నాయి.

హాస్టళ్లను కాపాడాలి

మద్దూరు, ధూళిమిట్ట, మండలకేంద్రాల్లోని ఎస్సీ హాస్టళ్లను కాపాడుకునేందుకు ప్రజాప్రతినిధులు, విద్యావంతులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు చొరవచూపాలని పలువురు కోరుతున్నారు. దీనికితోడు హాస్టళ్లలో ప్రవేశాల కోసం అధికారులు విస్తృతంగా ప్రచారం నిర్వహించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. రెండు హాస్టళ్లను కాపాడుకుంటే ఈ ప్రాంతంలోని నిరుపేద విద్యార్థులకు ఎంతో మేలు జరుగనున్నది. ఇప్పటికే రెండు హాస్టళ్లు మూతపడగా మరో రెండు హాస్టళ్లు మూతపడే ప్రమాదం ఉంది.

సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం చిట్యాలలో విచారణ ప్రారంభించిన నాబార్డు అధికారులు, ఎఫ్‌పీవో నిర్వాహకులు

నిధుల గోల్‌మాల్?

- రైతులు ఏర్పాటు చేసుకున్న ఫార్మర్ ప్రొడ్యుసింగ్ ఆర్గనైజింగ్ సంస్థ
- సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం చిట్యాలలో విచారణ చేపట్టిన అధికారులు

చేర్యాల, జూలై 26: సిద్దిపేట జిల్లా చేర్యాల మండలంలోని కడవేర్గు, చుంచనకోట, ఆకునూరు, వేచరేణి, చిట్యాల గ్రామాలకు చెందిన రైతులు ఏర్పాటు చేసుకున్న ఫార్మర్ ప్రొడ్యుసింగ్ ఆర్గనైజింగ్ సంస్థలో నిధుల గోల్‌మాల్ జరిగిందని రైతులు ఆరోపించారు. 2022లో ఏర్పడిన ఎఫ్‌పీవోలో ఐదు గ్రామాలకు చెందిన 380 మంది రైతులు సభ్యులు ఉండగా, ప్రారంభ సమయంలో రైతులు రూ.3లక్షల 60వేల వాటాధనాన్ని వెచ్చించగా నాబార్డు రైతుల కోసం రూ.6 లక్షల 20వేలను మంజూరు చేసింది. రైతుల వాటాధనం, నాబార్డు అందజేసిన సాయంతో ఎరువులు, విత్తనాలు, యంత్రాలు తదితర వాటి ని తీసుకొచ్చి సంస్థలో ఉన్న రైతులకు విక్రయించి వ్యాపారం కొనసాగించారు. మొదటి ఏడాది రూ.39 లక్షలు, రెండో ఏడాది రూ.38లక్షలు, మూడో ఏడాది రూ.18 లక్షల టర్నోవర్ జరిగినట్లు రైతులు తెలిపారు. ఇప్పటివరకు బాగానే ఉన్నప్పటికీ కొన్ని మాసాలుగా ఎఫ్‌పీవో కొనసాగిస్తున్న తీరుపై రైతులకు అనుమానం రావడంతో సంబంధిత శాఖ అధికారులకు సమాచారం అందించారు. శుక్రవారం నాబార్డు అధికారులతో పాటు ఎఫ్‌పీవో బాధ్యులు చిట్యాలలో విచారణ ప్రారంభించారు. దీంతో రైతులు తీవ్రస్థాయిలో నిర్వాహకులపై మండిపడ్డారు. ఈ విషయమై వివరణ కోరేందుకు నాబార్డు అధికారులకు ఫోన్ చేసినప్పటికీ వారు స్పందించడం లేదు.

ఎక్కడి సమస్యలు అక్కడే !

సాంఘిక సంక్షేమ గురుకులం, బీసీ, ఎస్సీ వసతి గృహాల్లో సమస్యల తిష్ట

సిద్దిపేట జిల్లా చేర్యాల గురుకులంలో పనిచేయని రైస్ బాయిల్డ్ స్టీమ్ యంత్రం

చేర్యాల, జూలై 26 : సిద్దిపేట జిల్లా చేర్యాల మండలంలోని సాంఘిక సంక్షేమ గురుకులం, బీసీ, ఎస్సీ వసతి గృహాల్లో విద్యార్థులు సమస్యలతో సతమతమవుతున్నారు. సంబంధితశాఖ ఉన్నతాధికారులు విద్యార్థుల సంక్షేమానికి ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. నిధులు లేవనే సాకుతో వసతి గృహాల ఇన్‌చార్జీలు పట్టించుకోవడం లేదు. దీంతో లక్షలాది రుపాయాలు ఖర్చు చేసి బీఆర్ఎస్ సర్కారు పంపిణీ చేసిన యంత్రాలు పాడైపోతున్నాయి. కాంగ్రెస్ సర్కారు అసలు ఎస్సీ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో నెలకొన్న సమస్యలను పట్టించుకోవడం లేదు. బీఆర్ఎస్ సర్కారు హయాంలో కేసీఆర్ రాష్ట్రంలో వేలాదిగా రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలలు నెలకొల్పి కార్పొరేట్ స్థాయి విద్య, వసతులు, భోజనం అందించారు. ప్రస్తుతం కార్పొరేట్ స్థాయి గురుకులంలో సమస్యలు రాజ్యమేలుతున్నాయి.

ఆలస్యమవుతున్న భోజనం తయారీ

సిద్దిపేట జిల్లా చేర్యాల పట్టణంలోని గురుకుల పాఠశాల, కళాశాలలో 600 మంది విద్యార్థులు విద్యను అభ్యసించేందుకు వసతులు ఉన్నాయి. ఈ సంవత్సరం కళాశాల, పాఠశాలలో మొత్తం 489 మంది విద్యార్థులు అడ్మిషన్ పొందారు. విద్యార్థులకు రోజువారీగా ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం స్నాక్స్, రాత్రి సమయంలో భోజనం అందించాల్సి ఉంటుంది. ఇందులో ముఖ్యంగా భోజనం ఎక్కువ మేరకు తయారు చేయాల్సి ఉండగా నిర్వాహకులు బాయిల్డ్ స్టీమ్ యంత్రాల్లో అన్నం సకాలంలో వండి విద్యార్థులకు అందజేస్తారు. మిగతా అల్పాహారం, స్నాక్స్, కోడిగుడ్లు తదితర వాటిని గ్యాస్ పొయ్యిలపై తయారు చేసి విద్యార్థులకు అందజేస్తారు. బాయిల్డ్ స్టీమ్ యంత్రం మరమ్మతుకు గురైంది. దీంతో గ్యాస్‌పొయ్యిలపైనే అన్నం వండాల్సి రావడంతో కొన్ని సమయాల్లో విద్యార్థులకు సకాలంలో భోజనం అందించలేకపోతున్నట్లు తెలిసింది. విద్యార్థులకు వారంలో మెనూ ప్రకారం రెండుసార్లు కోడిగుడ్లు, అరటిపండ్లు, నాలుగుసార్లు చికెన్ కర్రీ, ఇడ్లీ, బొండా, రెండుసార్లు చపాతి, మరో రెండుసార్లు పూరీలు అందించాల్సి ఉంటుంది. ఇవన్నీ తయారు చేసి సకాలంలో విద్యార్థులకు అందజేయడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

- పని చేయని రైస్ బాయిల్డ్ స్టీమ్, మినరల్ వాటర్ ప్లాంట్ యంత్రాలు
- పట్టించుకోని సంబంధితశాఖ ఉన్నతాధికారులు
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు

అందని మినరల్ వాటర్

గురుకులంలో విద్యార్థులకు మినరల్ వాటర్ అందించేందుకు ఏర్పాటు చేసిన ఆర్‌వో ప్లాంట్ పని చేయడం లేదు. మరమ్మతు చేయాలని అధికారులకు గురుకుల నిర్వాహకులు తెలియజేసినప్పటికీ వారు పట్టించుకోవడం లేదు. దీంతో విద్యార్థులకు మినరల్ వాటర్ అందక నీటి ట్యాంకులోకి వచ్చిన మిషన్ భగీరథ నీటిని విద్యార్థులకు అందిస్తున్నారు. మినరల్ వాటర్‌కు అలవాటుపడిన పలువురు విద్యార్థులు మిషన్ భగీరథ నీళ్లు తాగేందుకు ఇబ్బందులు పడుతుండగా తప్పని పరిస్థితుల్లో మరికొందరు నీటిని తాగుతున్నట్లు తెలిసింది.

మరమ్మతులకు యత్నిస్తున్నాం

గురుకులంలోని బాయిల్డ్‌స్టీమ్‌తోపాటు మినరల్ వాటర్ ప్లాంట్ యంత్రాలకు మరమ్మతులు చేయించేందుకు యత్నిస్తున్నాం. యంత్రాలకు గతంలో మరమ్మతులు చేయించినప్పటికీ మళ్లీ రిపేర్‌కు వచ్చాయి. ఆర్‌వో ప్లాంట్‌ను త్వరగా మరమ్మతు చేయాలని కోరాం. త్వరలో మరమ్మతులు పూర్తి చేయించేందుకు కృషి చేస్తాం.

- పుల్లయ్య, వైస్ ప్రిన్సిపాల్, చేర్యాల, సిద్దిపేట జిల్లా

సైనికుల సేవలు మర్చిపోలేనివి

సంగారెడ్డి జిల్లా కేంద్రంలో జ్యోతి వెలిగిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

సంగారెడ్డి కలెక్టరేట్, జూలై 26: సంగారెడ్డి కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో జిల్లా మాజీ సైనిక ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం కార్గిల్ విజయ్ దివస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు సంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి వెలిగించి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 25 ఏండ్ల క్రితం జరిగిన కార్గిల్ యుద్ధం గురించి గుర్తు చేశారు. దేశానికి రక్షణగా ఉన్న సైనికుల గొప్పతనాన్ని కొనియాడారు. కార్గిల్‌లో సైనికుల సేవలు మర్చిపోలేనివని పేర్కొన్నారు. మాజీ సైనికుల సంఘం జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, కార్యదర్శి వటపత్ర సాయి, జిల్లా సైనిక్ వెల్ఫేర్ బోర్డు మెంబర్ అనంత కిషన్, కూణ వేణు, లింగగౌడ్, అంజయ్య, మాజీ సైనికులు పాల్గొన్నారు.

తారా ప్రభుత్వ కళాశాలలో..

సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని తారా ప్రభుత్వ కళాశాలలో కార్గిల్ విజయ్ దివస్ వేడుకలు ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేఎస్ఎస్ రత్నప్రసాద్ జ్యోతి వెలిగించి విజయ్ దివస్ వేడుకలను ప్రారంభించారు. ఎన్‌సీసీ క్యాడెట్లకు బ్యాన్ పెట్టారు. కళాశాల వైస్ ప్రిన్సిపాళ్లు ప్రవీణ, డాక్టర్ వెంకటేశం, ఎన్‌సీసీ అధికారి మనోజ్‌కుమార్, ఎన్ఎస్ఎస్ అధికారులు జగదీశ్వర్, అభిజిత్, పద్మజ, సిద్దులు, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సంగారెడ్డి జిల్లా తారా ప్రభుత్వ కళాశాలలో జ్యోతి వెలిగించి ప్రదర్శన చేస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

చిరుత సంచారంతో ప్రజల్లో భయాందోళన

మెదక్ జిల్లా రామాయంపేట అటవీశాఖ పరిధిలో చిరుత దాడిలో చనిపోయిన దున్నపోతు

రామాయంపేట, జూలై 26: అటవీ ప్రాంతంలో చిరుత సంచరిస్తుండటంతో ఆయా గ్రామస్తులు భయభ్రాంతులకు గురవుతున్నారు. శుక్రవారం తెల్లవారుజామున మెదక్ జిల్లా రామాయంపేట మండలం అటవీశాఖ పరిధిలోని తొనిగండ్ల గ్రామ శివారులో ఓ పశువుల కొట్టంలోని దున్నపోతుపై చిరుత దాడి చేసి చంపేసింది. గ్రామానికి చెందిన పాటిగారి రమేశ్ గ్రామ శివారులో ఎప్పటిలాగే తన పశువులను కొట్టంలో తాడుతో కట్టేసి ఇంటికి చేరుకున్నాడు. ఉదయం పశువుల కొట్టం వద్దకు వెళ్లి చూడగా కొట్టం బయట చిరుత అడుగులు కనిపించాయని, కొట్టంలోపలికి వెళ్లడంతో దున్నపోతు చనిపోయి ఉందన్నారు. ఈవిషయమై రామాయంపేట అటవీశాఖ అధికారులను సమాచారం ఇచ్చినట్లు తెలిపాడు. అటవీ ప్రాంతంలో చిరుత సంచరిస్తూ పశువులపై దాడి చేయడంతో ఆయా గ్రామాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

సిద్దిపేట అదనపు కలెక్టర్, మున్సిపల్ కమిషనర్‌కు మొక్కలు అందజేస్తున్న సిబ్బంది

సిద్దిపేట, జూలై 26 : పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని సిద్దిపేట జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. దేశవ్యాప్తంగా మొక్కలు నాటాలన్న యూనియ న్ బ్యాంకు పిలుపు మేరకు సిద్దిపేటలోని రూరల్ సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్‌లో శుక్రవారం సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ ప్రసన్నరాణి, యూనియన్ బ్యాంక్ రీజినల్ మేనేజర్ వికాస్‌తో కలిసి ఆయన మొక్కలు నాటారు. యూనియన్ బ్యాంక్ డిప్యూటీ రీజినల్ మేనేజర్ రాఘవ, రీస్టి డైరెక్టర్ రాజలింగం పాల్గొన్నారు.

వన మహోత్సవం..లక్ష్యానికి దూరం

- మొక్కలు నాటడంలో చిత్తశుద్ధి లేని శాఖలు
- 15 శాఖల్లో ఒక్క మొక్క నాటని వైనం
- కేవలం 125 మొక్కలు నాటిన మెదక్ మున్సిపాలిటీ
- వర్షాలు కురుస్తున్నా పట్టించుకోని అధికారులు

ఇటీవల మెదక్ జిల్లా చిలిపిచెడ్‌లో వన మహోత్సవంలో భాగంగా మొక్క నాటి నీరుపడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్ (ఫైల్)

మెదక్, జూలై 26 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ ప్రభుత్వం హరితహారం కార్యక్రమం చేపట్టి లక్ష్యానికి మించి మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించింది. ఎక్కడ చూసినా పచ్చదనంతో చెట్లు ఆహ్లాదకరంగా కనిపిస్తుండేవి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వనమహోత్సవం కార్యక్రమాన్ని చేపడుతున్నది. ఆయా శాఖల వారీగా మొక్కలు నాటే లక్ష్యాలను నిర్దేశించింది. మెదక్ జిల్లాలో వారం రోజులుగా తేలికపాటి వర్షాలు కురుస్తున్నాయి. గ్రామీణాభివృద్ధి సంస్థ, అటవీ శాఖ ఆధ్వర్యంలో మాత్రమే మొక్కలు నాటుతుండగా, మిగతా శాఖలు ఇప్పటికీ మొక్కలు నాటే కార్యక్రమంపై దృష్టిపెట్టలేదు. మెదక్ జిల్లాలో ఈ ఏడాది 34,08,200 మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్దేశించారు. ఇప్పటి వరకు కేవలం 9,80,628 లక్షలు మాత్రమే నాటినట్లు అధికారిక గణంకాలు చెబుతున్నాయి. అంటే వన మహోత్సవంపై అధికార యంత్రాంగానికి చిత్తశుద్ధిలేదని స్పష్టమవుతోంది.

15 శాఖల్లో ఒక్క మొక్క నాటని అధికారులు

మెదక్ జిల్లాలో 23 ప్రభుత్వ శాఖలు ఉన్నాయి. కానీ, ఇప్పటి వరకు 15 శాఖల్లో వన మహోత్సవాన్ని ప్రారంభించలేదు. ఇందులో వ్యవసాయశాఖ, బీసీ వెల్ఫేర్, విద్యాశాఖ, ఇరిగేషన్ శాఖ, మార్కెటింగ్ శాఖ, వైద్యారోగ్య శాఖ, మైన్స్ శాఖ, మైనార్టీ వెల్ఫేర్, తూప్రాన్ మున్సిపాలిటీ, పోలీసు శాఖ, ఎస్సీ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్, టీఎస్ఎస్‌పీడీసీ, పశు సంవర్ధక శాఖ, స్త్రీ, శిశు సంక్షేమ శాఖలు ఉన్నాయి. మెదక్ మున్సిపాలిటీలో మాత్రం 75వేల మొక్కలు నాటాల్సి ఉండగా, ఇప్పటి వరకు కేవలం 125 మొక్కలు నాటడం విడ్డూరంగా ఉంది.

ఆ రెండు శాఖలే మొక్కలు నాటుతున్నాయి...

2024-25 సంవత్సరానికి జిల్లాలో అత్యధికంగా గ్రామీణాభివృద్ధి శాఖకు 18 లక్షలు, అటవీ శాఖలకు 10 లక్షల మొక్కలు నాటే లక్ష్యాన్ని నిర్దేశించారు. ఇప్పటి వరకు ఆ రెండు శాఖలు మాత్రమే మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నాయి. గ్రామీణాభివృద్ధి శాఖలో 5.69 లక్షల మొక్కలు నాటగా, అటవీ శాఖ ఆధ్వర్యంలో 4 లక్షల మొక్కలు నాటారు. వ్యవసాయ శాఖకు 25వేల మొక్కలు నాటాలని లక్ష్యం ఉండగా, ఒక్క మొక్క నాటలేదు. పరిశ్రమల శాఖకు 30వేల మొక్కలు నాటాలని ఉండగా, ఇప్పటి వరకు వెయ్యి మొక్కలు నాటారు. నర్సాపూర్ మున్సిపాలిటీలో లక్ష మొక్కలు నాటాలని లక్ష్యం కాగా, ఇప్పటివరకు 3వేల మొక్కలు నాటారు. రామాయంపేట మున్సిపాలిటీలో 25వేల మొక్కలకు 1500 మొక్కలు నాటారు. ఎక్సైజ్ శాఖకు 30 వేల మొక్కల లక్ష్యం కాగా, 3700 మొక్కలు నాటారు. ఇలాఅయితే లక్ష్యాలు ఎప్పుడు చేరుకుంటారని ప్రకృతి ప్రేమికులు పెదవి విరుస్తున్నారు.

భౌ..భౌ

- హడలెత్తిస్తున్న కుక్కలు
- గుంపులు గుంపులుగా సంచారం
- రక్తం రుచిమరిగి ప్రజలపై దాడులు
- జంకుతున్న పిల్లలు..భయాందోళనకు గురవుతున్న పెద్దలు
- కుక్కల దాడులు పెరిగినా పట్టించుకోని అధికారులు

గజ్వేల్: ఆర్‌అండ్‌ఆర్ కాలనీలోని పల్లెపహాడ్‌లో కుక్కల సంచారం

గజ్వేల్/కోహెడ, జూలై 26: గ్రామాలు, పట్టణాల్లో కుక్కలు గుంపులు గుంపులుగా తిరుగుతున్నాయి. కుక్కల భయానికి చిన్నాపెద్ద తేడా లేకుండా అందరూ భయపడుతున్నారు. కుక్కల దాడుల్లో ఎక్కువగా పిల్లలు గాయపడుతున్నారు. కుక్కల నియంత్రణకు అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. సిద్దిపేట జిల్లాలో 499 గ్రామ పంచాయతీలు, ఐదు మున్సిపాలిటీలు ఉన్నాయి. ఏటా కుక్కల దాడిలో గాయాలవుతున్న వారు సుమారుగా 5వేలకుపైగా ఉంటున్నారు. గ్రామాలతో పాటు మున్సిపాలిటీల్లో కూడా కుక్కల బెడద తీవ్రంగా ఉంది. ప్రజలు గల్లీల్లో కాలినడకన వెళ్లాలంటే భయపడుతున్నారు. గుంపులుగా కుక్కలు సంచరిస్తుండడంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం చోటు చేసుకుంటుందోనని భయపడుతున్నారు. కుక్కల కట్టడికి అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో ఇటీవల దాడులు పెరిగాయి. పట్టణాలు, గ్రామాల శివారు ప్రాంతాల్లో కోళ్ల వ్యర్థాలు, కోళ్ల ఫారాల నిర్వాహకులు చనిపోయిన కోళ్లను పాడేస్తున్నారు. కుక్కలు వాటిని ఆహారంగా తీసుకొని రక్తం రుచిమరుగుతున్నాయి. గుంపులుగా సంచరిస్తూ కనిపిచ్చిన వారినల్లా కరుస్తున్నారు. ఎక్కువగా పిల్లలు వాటి బారినపడుతున్నారు. కాలనీలు, గ్రామాల్లో కొత్త వ్యక్తులు కనిపిస్తే అరుస్తూ దాడికి పాల్పడుతున్నాయి. గజ్వేల్ పట్టణంలో ఉదయం, రాత్రి సమయంలో కాలినడకన వెళ్లే వాళ్లు కుక్కల కారణంగా భయంతో ముందుకు సాగుతున్నారు. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు కుక్కలకు కు.ని. ఆపరేషన్లు చేసి వాటిని నియంత్రించాల్సి ఉండగా, ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. జూన్ 29న సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్‌లో బీహార్ వలస కుటుంబానికి చెందిన విశాల్(6)పై వీధికుక్కలు దాడిచేసి దారుణంగా చంపాయి. మెదక్ జిల్లా నర్సాపూర్, రామాయంపేట, సంగారెడ్డి జిల్లాలోనూ పలుచోట్ల కుక్కల దాడిలో పలువురు గాయపడ్డారు. కోహెడ మండలంలో వీధి కుక్కలు స్కూల్ పిల్లలు, బాటసారులపై దాడి చేస్తూ ఆందోళనకు గురి చేస్తున్నాయని బీజేపీ కోహెడ మండల అధ్యక్షుడు ఖమ్మం వెంకటేశం ఇటీవల మీడియా ఎదుట వాపోయాడు. తరుచూ స్కూల్ పిల్లలపై, బాటసారులపై దాడి చేస్తూ గాయపరుస్తున్నట్లు ఆయన తెలిపాడు. అధికారులు కుక్కల బారి నుంచి కాపాడాలని ఆయన కోరారు. కోహెడ రహదారులపై రాత్రిపూట వాహనాలపై వెళ్తున్న వారిపైకి వస్తుండటంతో వాహనాలపై నుంచి పడి గాయపడుతున్నట్లు తెలిపారు. జంతు యాక్టు ఉన్నప్పటికీ ఇతర మార్గాలు అన్వేషించి కుక్కల బారి నుంచి ప్రజలను కాపాడాలని ఆయన కోరారు.

కోహెడలో స్వైర విహారం చేస్తున్న కుక్కలు